క్లుప్తంగా

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ బాలాజీనగర్‌కు చెందిన లక్ష్మి ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు బుధవారం బాధితురాలికి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అన్ని విధాల అండగా ఉంటామని వారికి హామీనిచ్చారు. ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు చేయించి నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు కొండ శ్రావణ్‌కుమార్‌యాదవ్, కాలనీవాసులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


పడిపూజ గురూజీ తదితరులు

కందుకూరు: మండల పరిధి పులిమామిడి శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బుధవారం బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి, గణపతి, కుమారస్వామితో పాటు స్వామి నిఖిలేశ్వరానంద విగ్రహాలకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తిగీతాలతో ఆ ప్రాంతం మారుమోగింది. అనంతరం అయ్యప్ప విగ్రహాలను రథంపై ఊరేగించారు. అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం అందించారు.

ఘనంగా సాంస్కృతిక వేడుకలు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కేంద్రంలోని మాస్టర్ మైండ్ జూనియర్ కాలేజీలో సాంస్కృతిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యులుగా సీనియర్ చార్టెడ్ అకౌంట్ కార్వాన్ లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడుతూ.. వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు సాంస్కృతిక ఉత్సవాలు జరపాలన్నారు. వీటితో సామాజిక, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. నైపుణ్యాలు అన్వేషించడానికి, వృద్ధి చేయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. కళాశాల సెక్రటరీ డా.పాండు, కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.జగన్‌మోహన్‌రావు, డైరెక్టర్స్ నాగేంద్ర, లగ్‌పతి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, నవనీత, డిపార్ట్‌మెంట్ హెడ్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్ తదితరులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్ నగర్ గ్రామం నుంచి విద్యార్థులు మహేశ్వరం ప్రభుత్వ కళాశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. బుధవారం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మహేశ్వరం డిపో మేనేజర్‌కు స్థానికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి బస్సు వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన హోమం

మన్సూరాబాద్: వేద హవన సహిత గజేంద్ర మోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞానయజ్ఞ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. నాగోలు డివిజన్ పరిధి జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీలో వైదిక విజ్ఞానట్రస్ట్, ధర్మరక్ష సంస్థ సంయుక్త ఆధ్వరంలో కొనసాగుతున్న పాంచాహ్నిత జ్ఞానయజ్ఞ మహోత్సవాల్లో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌యాదవ్ హాజరయ్యారు.

‘ఇందిరమ్మ’ మోడల్ హౌస్

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నమూనా నిర్మాణం
- అనంతరం లబ్ధిదారులకు అవగాహన
- ఒక్కో యూనిట్ విలువ రూ.5 లక్షలు
- నాలుగు విడతలుగా చెల్లింపు
- తొలి విడతలో కానిస్టిట్యూన్సీకి 3,500 ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నమూనా

మహేశ్వరం: ఎన్నికల్లో ప్రకటించిన విధంగా పేదోడి సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా తొలుత ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇంటికోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. పరిశీలన ప్రక్రియ అనంతరం అధికారులు నిజమైన అర్హుల కోసం సర్వే చేస్తున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు వారి వివరాలను ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పుడు ఏకంగా ఇళ్ల నమూనాలను శ్రీకారం చుట్టింది. ఈ ఆకృతుల్లో ఇళ్లు నిర్మించుకోవాలంటూ లబ్ధిదారులకు అవగాహన కల్పించనున్నారు.

గృహ నిర్మాణ శాఖ ఆవరణలో..

ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. మహేశ్వరం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని గృహ నిర్మాణ శాఖ ఆవరణలో మోడల్ ఇంటి నిర్మాణానికి అనువైన స్థలాన్ని హౌసింగ్ డీఈ, ఏఈ, ఎంపీడీఓ, పంచాయతీరాజ్ ఏఈలు పరిశీలించారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

దశలవారీగా చెల్లింపులు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చెల్లించనుంది. ఈ మొత్తాన్ని పునాది నుంచి స్లాబ్‌లెవల్, ప్లాస్టరింగ్ వరకు నాలుగు విడతల్లో అర్హుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయనుంది. పునాది దశలో రూ.లక్ష, కిటికి దశలో రూ.1.75 లక్షలు, స్లాబ్ దశలో రూ.1.25 లక్షలు, నిర్మాణం పూర్తయ్యాక మరో లక్ష ఇవ్వనుంది. దీంతో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారు. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ప్రభుత్వం కేటాయించనుంది.

త్వరలో నిర్మాణం



ప్రతి మండల పరిషత్ కార్యాలయ పరిధిలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మోడల్ ఇంటిని వచ్చిన నిధులతో ఎలా నిర్మించుకోవాలనే దానిపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాం. మహేశ్వరం, కందుకూరు మండల కేంద్రాల్లో మోడల్ హౌస్ నిర్మాణం కోసం గృహ నిర్మాణ శాఖ స్థలాన్ని పరిశీలించాం. త్వరలో నిర్మాణ పనులు చేపడతాం.

– భూక్య నాయక్, హౌసింగ్ డీఈ, మహేశ్వరం

నచ్చిన రీతిలో ఇళ్ల నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల నమూనాను అనుసరించి బెడ్ రూమ్, అటాచ్ బాత్ రూమ్, కిచెన్, ప్రహరీ, స్లాబ్‌పైకి వెళ్లేందుకు మెట్ల నిర్మాణం తప్పనిసరి. కనీసం 400 ఫీట్లలో ఇంటి నిర్మాణం చేపట్టాలి. ఆర్థిక స్తోమత ఉంటే 500 వరకు నచ్చిన రీతిలో నిర్మించుకునే అవకాశం కల్పించింది. ఈ డిజైన్‌లోనే నిర్మించుకోవాలని ఎలాంటి ఆదేశాలు పెట్టలేదు.

ధర్మ పరిరక్షణే వీహెచ్‌పీ లక్ష్యం

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు యాదవ్

మహేశ్వరం: ధర్మ పరిరక్షణే విశ్వహిందూ పరిషత్ లక్ష్యమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాలుగా హిందూ సమాజాన్ని ఏకీకృతం చేస్తూ, లోక కల్యాణం కోసం, సమాజ సేవ చేయడం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. వీహెచ్‌పీ.. అయోధ్య రామ మందిరం కోసం చేసిన పోరాటాలు మరువలేనివని వెల్లడించారు. భజరంగ్‌దళ్ చేపట్టిన త్రిశూల్ దీక్షతో యువతలో చైతన్యం వస్తుందని చెప్పారు. గోహత్యలు, దేవాలయాల విధ్వంసం, హిందూ మహిళలపై లవ్ జీహాదిలను అరికట్టేందుకు భజరంగ్‌దళ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు

కందుకూరు: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌చందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి కొనియాడారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పి.భిక్షపతి, ఎస్.మల్లారెడ్డి, జి.ప్రభాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బి.మల్లేశ్, సీనియర్ నాయకులు జి.అమరేందర్‌రెడ్డి, ఎన్.నర్సింహారెడ్డి, కె.జంగారెడ్డి, యు.మహేందర్, లయన్స్ క్లబ్ నిర్వాహకులు తాళ్ల అంజయ్య, కె.వెంకటేశ్‌గుప్తా, నాయకులు పాల్గొన్నారు.


మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వాజ్‌పేయికి ఘన నివాళి

మీర్‌పేట: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి వేడుకలను మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తాలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు ఎద్ల మల్లేశ్ ముదిరాజ్, ఇంద్రావత్ రవినాయక్, రాజేశ్‌రెడ్డి ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


చైర్మన్ శివసేనారెడ్డిని జ్ఞాపికతో సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ శివసేనారెడ్డి

బడంగ్‌పేట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. బాచుపల్లిలోని పల్లవి స్కూల్ వార్షికోత్సం సందర్భంగా స్పోర్ట్స్‌మైట్ ఎలజైన్–2024 పేరుతో గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శివసేనారెడ్డితో పాటు కల్నల్ అనిల్‌కుమార్, నేషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ చేతన్ ఆనంద్, ఇండియన్ మౌంటెనీర్ మలావత్ పూర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయం సాధించాలంటే పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా మార్చ్ ఫాస్ట్, స్పార్కిల్ స్క్వాడ్, డాన్సింగ్ పెటల్స్, స్వే అండ్ స్ట్రేడ్ బాంబూ, బీట్స్ ఫ్లాగ్ ఆఫ్ యూనిటీ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య, డైరెక్టర్ సుశీల్, అకాడమిక్ డైరెక్టర్ సుధ, మల్కా యశస్వి, ప్రిన్సిపాల్ బి.అనురాధ, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

మున్సిపాలిటీ వద్దు.. పంచాయతే ముద్దు

- మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రభుత్వం ఆలోచించాలి
- బీఆర్ఎస్ మండల నాయకుడు కుమ్మరి రాము


ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న మున్సిపాలిటీల ఏర్పాటులో గ్రామాల స్థాయిలో అభిప్రాయాలు సేకరించి నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుమ్మరి రాము పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ ఎదుట గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎన్కెపల్లి, జీవన్‌గూడ గ్రామస్తులతో కలిసి మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతీ ముద్దు.. అనే పేరుతో ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు గాలికి వదిలి 111 జీవోలో ఉన్న మొయినాబాద్ మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన విమర్శించారు. ప్రజల అభిప్రాయం లేకుండానే ఏకాభిప్రాయంగా సూచించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందుగా 111 జీవోను తొలగించి మున్సిపాలిటీ జోలికి రావాలన్నారు. అభిప్రాయాల సేకరణలో గ్రామాల ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కుమ్మరి రాము, పెండ్యాల శ్రీనివాస్, సురేశ్, ప్రభాకర్, రమేశ్, మల్లేశ్, రవీందర్, చంద్రబోస్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

సంస్మరణ సభ


సంస్మరణ సభలో మాట్లాడుతున్న వక్తలు

వనస్థలిపురం: ప్రభుత్వ రంగ పరిశ్రమలలో కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడడంలో నండూరి సుమిత్ర కీలక పాత్ర పోషించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. వనస్థలిపురం ద్వారకామయినగర్‌లోని గ్రీన్ మెడోస్ హోంలో జరిగిన నండూరి సుమిత్ర సంస్మరణ సభలో వీరయ్య పాల్గొని మాట్లాడారు. ఆయా ఉద్యమాలలో నండూరి ప్రసాదరావు వెనుక ఉండి సుమిత్ర ఆయనకు తగిన సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావు, జాన్ వెస్లీ, భూపాల్, యాదయ్య, రమా, ఈశ్వర్‌రావు, ప్రసాద్, చంద్రమోహన్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని బుధవారం జరిగిన కాలనీ సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాంతారెడ్డి, కోశాధికారిగా మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కొండల్, మహిపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా కె.దశరథరామిరెడ్డి, మల్లికార్జున్‌ను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా లింగయ్య, శ్రీశైలం గౌడ్, జాయింట్ సెక్రటరీగా మల్లేశ్, కనకాచారి, సలహాదారులుగా రవీందర్‌నాయక్, ఎల్.శ్రీకాంత్‌రెడ్డి దేవాలయ కమిటీ సభ్యులుగా శ్రీధర్‌రెడ్డి, రవీందర్, రవిచంద్ర, ప్రవీణ్, అరుణ్, రాజు, యాదయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సభ్యులను సత్కరిస్తున్న కాలనీవాసులు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్

మహేశ్వరం నియోజకవర్గంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే క్రైస్తవులు చర్చిలకు చేరుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పండుగ సందర్భంగా ప్రధాన చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చర్చి ప్రాంగణాల్లో వేసిన క్రీస్తు జనన ఘట్టాలు, శాంతాక్లాజ్(క్రిస్మస్ తాత), పశువుల పాకలో క్రీస్తు జననం వంటి అలంకరణలు, స్టాళ్లు ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, మిత్రులు క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు యేసుక్రీస్తు సూక్తులను వినిపించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆటాపాటలు అందరినీ అలరించాయి.


మహేశ్వరం: లిల్లీపూర్ సెయింట్ థామస్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి


పహాడీషరీఫ్: కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు


కందుకూరు: కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఐ సైదులు


మహేశ్వరం: కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు

వైభవంగా మహా పడిపూజ

షాబాద్: అయ్యప్ప నామస్మరణలతో బుధవారం మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతవరణాన్ని సంతరించుకుంది. చందనవెళ్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి మహాపడిపూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ స్వామివారికి పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు.

గో సంతతిని కాపాడుకుందాం

చంచల్‌గూడ: గో సంతతిని కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాదన్నపేట మార్కెట్ గోశాల గౌరవ అధ్యక్షుడు సహదేవ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో గోశాలలో ప్రత్యేక పూజలు చేసి గో సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీ కృష్ణుడి సంకీర్తనలు ఆలపిస్తూ కుర్మగూడ డివిజన్‌లోని వీధుల్లో భజన చేశారు. ఈ సందర్భంగా సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ.. హిందూ ధర్మంలో గోవు విశిష్టతను చిన్నారులకు బాల్యం నుంచి వివరించాలన్నారు. కృష్ణుడు బోధించిన భగవద్గీత సారాంశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించేలా ప్రయత్నించడం, కృష్ణతత్వాన్ని విస్తరించడమే ఇస్కాన్ లక్ష్యమని ప్రతినిధి ప్రేమ్‌రతన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోశాల ప్రతినిధులు ఉగాది మహేష్, నిరంజన్‌యాదవ్, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, యుగేందర్, వరుణ్, పండిత్, జనార్దన్, అనిల్‌యాదవ్, వెంకట్, నాగరాజు పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న పొగమంచు

వణికిస్తున్న చలిపులి
- మంచుదుప్పటితో కనిపించని రోడ్లు
- గ్రామీణ ప్రాంత రోడ్లపై వరికుప్పలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు


జాపాల రోడ్డులో (వరి కుప్పలు) మంచుపొగ

మంచాల: చలి తీవ్రత, మంచు ప్రభావంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులుగా వీస్తున్న చల్లటి గాలులు, దానికి తోడు దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో వాహనదారులకు రోడ్డు కనిపించడం లేదు. లైట్లు వేసినా లాభం లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బంది పడుతున్నారు. పొలాలకు వెళ్లే రైతుల పరిస్థితి అదే విధంగా ఉంది. చలితో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నా, చిన్నపిల్లలు బడికి వెళ్లాలన్నా.. గజగజా వణికి పోతున్నారు.

8 గంటలు దాటినా..

ఉదయం వేళలో అలా ఉండగా.. ఇక సాయంత్రం నాలుగు దాటిందంటే గ్రామీణ ప్రాంత ప్రజలు ముసుగేస్తున్నారు. రాత్రి 10.00 గంటల నుంచి మంచుతో కూడిన చలితో గజగజా వణికిపోతున్నారు. చలి మంటలు కాగుతున్నారు. ఉదయం 8 గంటలకు చలితీవ్రత ఏమాత్రం తగ్గకపోవడం, మంచుతెర తొలగక పోవడంతో రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వణికిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ భయంగానే ప్రయాణం కొనసాగిస్తున్నారు.

రహదారిపై వరి కుప్పలు

చలి, పొగమంచుతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. రోడ్లపై పోసిన వరికుప్పలు ప్రమాదకరంగా మారాయి. మంచుతెరలో వరి కుప్పలు కనిపించక ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోలేదు. ఏమాత్రం ఆదమరచినా ముప్పుతప్పదని పలువురు పేర్కొంటున్నారు.

జాగ్రత్తగా ఉండాలి



మంచుపొగతో రోడ్లు కనిపించడం లేదు. వాహనదారులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మలుపుల వద్ద, ప్రమాద సూచికలు గమనిస్తూ ముందుకు సాగాలి. కార్లు నడిపేవారు సీటు బెల్టు, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి. తగిన వేగంతో సురక్షితంగా ప్రయాణించండి.

– ఎ.మధు, సీఐ, మంచాల